www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 జూన్ 2024
5
అన్నమయ్య

జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు 'జ్ఞానాంబిక' విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమాదేవి

ప్రజాశక్తి-మదనపల్లి : జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు జ్ఞానాంబిక విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీలకు మదన పల్లికి చెందిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహిం చిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో తమ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కె.రిషిత, ఎస్.సుజిత ముంబైలో జరిగే ఫైనాన్స్ క్విజ్ పోటీలకు ఎంపిక య్యారన్నారు. వీరికి ఈ నెల 30వ తేదీన రూ.25 వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర తెలిపారు. జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

నేడే కౌంటింగ్

కౌంటింగ్‌కు సిద్ధమైన అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్నికల లెక్కింపు కేంద్రం

కౌంటింగ్‌కు సిద్ధమైన వైఎస్ఆర్ కడప జిల్లా ఎన్నికల లెక్కింపు కేంద్రం

- కడప, రాయచోటి కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు
- ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్‌కు 14 టేబుళ్లు
- తొలుత పోస్టల్ బ్యాలెట్ గణన
- తొలి ఫలితం కమలాపురానిదే

సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. కడప, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లోని మౌలానా అబుల్ కలామ్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆయా జిల్లాల అధికార యంత్రాంగాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆయా జిల్లాల కలెక్టర్లు సుశిక్షితులైన సిబ్బందితో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు జిల్లాలకు చెందిన ఎస్పీలు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. రౌండ్ల వారీ లెక్కింపు అవకాశాలను పరిశీలిస్తే తొలి ఫలితం కమలాపురం, తుది ఫలితం జమ్మలమడుగు స్థానాలకు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

కడప, అన్నమయ్య జిల్లాలోని రెండు పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కడప జిల్లాలో 16,39,066 ఓటర్లు ఉన్నారు. కడప పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్ స్థానానికి ఇదేవిధంగా టేబుల్స్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు, ఇతర సిబ్బందితో కలిసి 911 మందిని నియమించారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా తొలి అర్ధగంటపాటు 22,645 అసెంబ్లీ, 22,635 పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. అనంతరం పోలైన ఓట్లను లెక్కింపు ప్రారంభం కానుంది. కమలాపురం అసెంబ్లీ స్థానానికి 18 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్న నేపథ్యంలో తొలి ఫలితంగా వచ్చే అవకాశం కనిపిస్తోంది. జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి 23 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఈలెక్కన జమ్మలమడుగు ఆఖరున ఫలితం వెలువడే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన ఐదు అసెంబ్లీ స్థానాలు 20 రౌండ్లలో లెక్కించనున్న నేపథ్యంలో మధ్యస్థంగా ఫలితాలు వెల్లడి కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జమ్మలమడుగు ఫలితం తరహాలోనే పార్లమెంట్ ఫలితమూ ఆలస్యం వెల్లడి కానున్నట్లు తెలుస్తోంది.

అన్నమయ్య జిల్లాలో ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలోని 14,26,834 మంది ఓటర్లలో 14,1115 ఓటింగులో పాల్గొన్నారు. ఈలెక్కన 77.85 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఆరింటి అసెంబ్లీ స్థానాలకు రెండేసి కౌంటింగ్ కేంద్రాల చొప్పున 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో అసెంబ్లీ స్థానానికి 14 టేబుళ్ల చొప్పున ఆరింట్లో 168 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ 1033 మంది సిబ్బందిని నియమించారు. జిల్లాలోని రాజంపేట పార్లమెంట్ స్థానానికి 21,490 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ముందుగా తొలి అర్ధగంట సమయం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం సాధారణ ఓట్లను లెక్కింపు ప్రారంభమవుతుంది. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లడానికి సుమారు 600 మీటర్ల దూరంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసింది. అధికార వైసిపి, కూటమి పార్టీలకు, కౌంటింగ్ సిబ్బంది, మీడియా సిబ్బందికి వేర్వేరుగా ఏర్పాటు చేసింది. జిల్లా పోలీస్ యంత్రాంగం కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసింది. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. బాణాసంచా కాల్చడం, మద్యం అమ్మకాలను నిషేధించింది. ఏజెంట్లు ఏవిధంగా వ్యవహ రించాలనే అంశాలపై ముందుగానే శిక్షణ ఇచ్చారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

టెన్షన్..టెన్షన్..

కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్నకొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ ..టెన్షన్ వాతావరణం నెలకొంది. ఫలితం ఎలా ఉంటుందోననే ఉత్కంఠ రాజ్యమేలుతోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో మిశ్రమ స్పందన కనిపించ డంతో ఎవరు ఎదురు పడినా ఫలితంపై చర్చించుకోవడం కనిపి స్తోంది. బెట్టింగురాయుళ్ల పందేల జోరు అడ్డూఅదుపూ లేకుండా సాగిపోతోంది. జిల్లాలోని ఆయా గ్రామాల వారీగా మెజార్టీ ఎవరికి, బూత్‌ల వారీగా, మండలాల వారీగా అంచనాలు వేసుకుంటున్న పరి స్థితి కనిపిస్తోంది.

కడప నగర శివారులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

దేవాదాయ శాఖ

ఎసిపై ఫిర్యాదుల పరంపర

- జిల్లా అధికారులకు సిపిఎం వినతి
- అవినీతి ఆరోపణలపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - కడప సిటీ

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇటీవల ఎసి ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత బస్టాండులోని సిపిఎం జిల్లా కార్యాలయం కూల్చివేతకు విఫలయత్నం చేశారు. కార్యాలయం కూల్చివేత ప్రయత్నాన్ని సిపిఎం నాయకత్వం అడ్డుకున్న సంగతి తెలిసిందే. జిల్లాలో ఎన్నికల కోడ్, 144 సెక్షన్, 30 యాక్ట్ వంటి చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ లా అండ్ ఆర్డర్‌ను జిల్లా అధికారే ప్రశ్నార్థకం చేసేలా వ్యవహరించడం దారుణమని, ఇటువంటి వివాదాస్పద అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. సిపిఎం జిల్లా కమిటీ ఫిర్యాదు చేయడంతో జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు, ప్రజాసంఘాల నుంచి అసిస్టెంట్ కమిషనర్ తీరుపై విమర్శల వర్షం కురుస్తోంది. పదేళ్లుగా జిల్లాలోనే తిష్ట వేసుకుని కూర్చుకుని ప్రొద్దుటూరు శివాలయం మొదలుకుని ప్రొద్దుటూరులోని గీతాశ్రమం, గోశాల, బ్రహ్మం గారిమఠం, రాజంపేట తదితర ప్రాంతాల్లో ఆయన పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండడం గమనార్హం. సుమారు దశాబ్దానికిపైగా జిల్లాలోనే ఉండడంలోని మతలబేమిటో తెలియడం లేదనే విమర్శ వినిపిస్తోంది. సాధారణంగా మూడేళ్లు, ఐదేళ్ల వ్యవధిలో ప్రభుత్వ అధికారులు బదిలీలు కావడం సహజం. కానీ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పదేళ్లకుపైగా జిల్లాలో ఉండడంలోని ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. దశాబ్దానికిపైగా జిల్లాలోనే పాతకుపోయిన నేపథ్యంలో ఆయన రాజకీయ నాయకుల దగ్గర నుంచి డిపార్టుమెంట్ వరకు ఎవరూ ప్రవర్తించే అవకాశం లేకుండా చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆయన పరపతి ముంగిట దేవాదాయ శాఖ అధికారులు నిలబడలేని పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి. ఇంతటి స్థాయిలో రాజకీయ, అధికారుల అండదండలు ఉండ బట్టే శాంతిభద్రతలను సైతం ఉల్లంఘించే సాహసానికి ఒడిగట్టారనే వాదన వినిపిస్తోంది. ఎన్నికలకోడ్, 144 సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉండగానే ఒక ఉద్యమ రాజకీయ పార్టీ కార్యాలయంపై బరితెగింపుతో రావ డంలోని మతలబేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇంతటి స్థాయిలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్న వివాదాస్పద అధికారిపై తక్షణమే శాఖాపరమైన విచారణకు ఆదేశించాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి.

దేవాదాయ శాఖ ఎసిపై విచారణ చేపట్టాలి

దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సాగించిన అవినీతి ఆరోపణలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. పదేళ్లకు పైగా కడప జిల్లాలోనే ఉండడం వల్లే ఇంతటి స్థాయిలో ఆరోప ణలు వస్తున్నాయి. ఇంతటి స్థాయిలో అవినీతి ఆరోపణలు ఉన్న అధికారిని చూడలేదు. ఈయనపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

- బి.మనోహర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

బద్వేల్ : మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-బద్వేల్

అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, మహిళా సంఘం పట్టణ నాయకులు మోక్షమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల సమావేశం సిఐటియు పట్టణ కో-కన్వీనర్ బి.సి. కొండ య్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయ శాఖ ఆలయాలు సంబ ంధించి నిష్పక్షపాతంగా అభివద్ధి చేయడం లేదని తెలిపారు. దేవా దాయ స్థలాలను కాంప్లెక్స్‌లను అనుకూలమైన వ్యక్తులకు కట్టబె డుతున్నారని విమర్శించారు. లాభాపేక్షతో కమర్షియల్ స్థలాలను చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అట్లూరు మండల కార్యదర్శి ఇ. రమణయ్య. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చంద్‌బాష, నాయకులు. పుల్లయ్య, రామమోహన్, షరీఫ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** శంకర్‌బాలాజీ చేసిన అవినీతి ఆరోపణల దృష్ట్యా వెంటనే తగిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకర్‌బాలాజీ దాదాపు 11 ఏళ్ల పదవీలో కొనసాగుతూ రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఆయన అవినీతి భాగోతం తారాస్థాయికి చేరుకుందని వాపోయారు. అక్రమార్జనకు పాల్పడ్డారన్నారు. రాజంపేటకు సంబంటధించి 2 ఎకరాలు ఎండోమెంట్ భూమిని అమ్మిన సమయంలో అధికారులు ఛార్జ్‌మెమో జారీ చేశారని గుర్తు చేశారు. ప్రొద్దు టూరులో ఆవుల పశుగ్రాసం కోసం అక్రమంగా రూ.లక్షలు డ్రా చేశారన్నారు. అక్కడ పశువుల లేకున్నా వాటి పేరు చెప్పి అక్రమార్జన చేశారన్నారు. షెడ్డు లేకున్నప్పటికీ షెడ్డు నిర్మాణానికి అని రూ.లక్షలు దిగమింగారని షెడ్డు విషయం చర్చనీయాంశం కావడంతో పది రోజుల కిందట షెడ్డు నిర్మించా రన్నారు. ఆశ్రమంలో ఒక క్లర్కు ఉంటే అతని ద్వారా పని జరుగు తుందని అలాంటిది ఆరుగురు క్లర్కులను నియమించారన్నారు. బ్రహ్మం గారిమఠంలో రూ.25 లక్షల హుండీ డబ్బులు, అరకిలో బంగారం శంకర్‌బాలాజీ మాయం చేశారని అక్కడున్నవారు ప్రొద్దుటూరు, కడపలో కారు వినియోగించినట్లు చెప్పి రూ.14 లక్షలు కారు అద్దె దిగమింగారన్నారు. ప్రొద్దుటూరు గీతాశ్రమం అద్దెలకు సంబం ధించి దాదాపు రూ. 8 కోట్ల మేర స్వాహా చేశారని తెలిపారు. అవినీతితో ఆర్జించిన సొమ్మును రికవరీ చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. సమావేశంలో ఆటోయూనియన్ నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, సమ్మిళితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాలుగా భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసిందని జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లతో కౌంటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నామన్నారు. సాయి ఇంజినీరింగ్ కళాశాలలో 6 అసెంబ్లీ నియో జకవర్గాలకు 6 కౌంటింగ్ హాళ్లు, ఒక పార్లమెంట్ నియోజ కవర్గానికి ఆరు ఇవిఎం కౌంటింగ్ హాల్స్, ఒక పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా సాయి ఇంజినీరింగ్ కళాశాలలో బారికేడింగ్, కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ, కౌంటింగ్ హాల్లో కావాల్సిన సామగ్రి, భద్రతా యంత్రాంగం, ఇలా అన్ని విషయాలలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శాంతి భద్రతల విషయంలో మూడంచెల భద్రతతో పటిష్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్స్ అనుమతి లేదని చెప్పారు. కౌంటింగ్ హాలులోకి ఇవిఎంలను తీసుకువెళ్లేందుకు, హాలులోకి వెళ్లే కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు వేరువేరుగా దారులు ఏర్పాటు చేశామని చెప్పారు. 4న ఉదయం 6 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూములను తెరవబోతున్నామని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ల కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందని, 8.30 గంటలకు ఇవిఎంల కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బందికి పటిష్టమైన హాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చాం, వారు కౌంటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నారు.

భద్రత ఏర్పాట్లు పూర్తి

కౌంటింగ్ సందర్భంగా మూడంచెల భద్రతతో కౌంటింగ్ కేంద్రానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పి బి.కృష్ణారావు తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి లోపల, బయట కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఎవరైనా కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు తలపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 6 వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని, అప్పటివరకు ఈ సెక్షన్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలతో పాటు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30, 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు.

రికార్డు స్థాయికి టమోటా ధర

మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమోటా

కిలో రూ.56
రోజురోజుకూ పెరుగుతున్న ధరలు

ప్రజాశక్తి-మదనపల్లి

టమోటా ధరలు రోజురోజుకు పుంజుకుం టున్నాయి సోమవారం జరిగిన విక్రయాలలో అంగళ్ల టమోటా మార్కెట్‌లో 25 కిలోల బాక్స్ రూ.1400 గరిష్టంగా పలికింది (కిలో రూ.56). మదనపల్లి టమోటా మార్కెట్ యార్డ్‌లో 25 కిలోల బాక్స్ రూ.1300 పలికింది(కిలో ధర రూ.52). పుంగనూరు టమోటా మార్కెట్‌లో కిలో ధర రూ.40, మొలకలచెరువు మార్కెట్ యార్డ్‌లో కిలో ధర రూ.30 చొప్పున సోమవారం టమోటాకు ధర పలికింది. టమోటా రైతులు ధరలు పెరగడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యదర్శి అభిలాష్‌ను వివరణ కోరగా టమోటా దిగుబడి తగ్గడం వల్లనే ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. దీని ద్వారా రైతులు ఎంతో లబ్ధి పొందుతారన్నారు. గత ఏడాది మే నెలలో 23,8260 టన్నుల టమోటాలు మార్కెట్ యార్డ్‌కు వచ్చిందన్నారు. ఈ ఏడాది మే నెలలో కేవలం 14,9800 టన్నులు మాత్రమే టమోటాలు మార్కెట్‌కు వచ్చాయన్నారు. గత ఏడాది జూన్, జూలై నెలలో టమోటా ధరలు ఎక్కువ పలకడంతో ఈ ఏడాది కూడా జూన్, జూలై నెలలో ఆశాజనకంగా ఉంటాయని అందుకు అనుగుణంగానే టమోటా రైతులు టమోటా సాగును చేశారని తెలిపారు. అందువలననే టమోటా దిగుబడి తగ్గి ధరలు పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం మహారాష్ట్రలో మోటాలు దిగుబడి పెరిగి ఆ టమోటాలు హైదరాబాదు మార్కెట్‌కు వస్తున్నాయని అక్కడ నుండి టమోటా దిగుమతి తగ్గితే ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మదనపల్లి మార్కెట్ యార్డ్ నుండి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, చండీగర్, ఆగ్రా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని పేర్కొన్నారు ఏది ఏమైనా టమోటా ధరలు పుంజుకోవడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు.

డిగ్రీతోనూ అధిక వేతన ఉద్యోగాలు సాధ్యం

- నార్త్ స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్

ప్రజాశక్తి-పీలేరు

డిగ్రీ విద్యార్హతని చిన్నచూపు చూడాల్సిన పనిలేదని, దాంతోనూ అధిక వేతనాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని ప్రముఖ సంస్థ నార్త్ స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్ తెలిపారు. సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం పీలేరు ప్రాంత విద్యార్థులకు ఇంటర్ తర్వాత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందలేమన్న అపోహలో చాలా మంది విద్యార్థులు ఉన్నారని, మారిన సాంకేతిక, ఆర్థిక జీవనోపాదుల నేపథ్యంలో డిగ్రీతోనూ మంచి ఉపాధి అవకాశాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న సంస్థలు ఉద్యోగార్థుల విద్యార్హతలను చూసి కాకుండా వారిలోని సాంకేతిక విద్య పట్ల ఎక్కువగా దృష్టి సారిస్తున్నారన్నారు. డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులు తమ తృతీయ ఏడాదిలో టెస్టింగ్ టూల్స్, డాట్ నెట్, ఎస్ఎపిఐసిడబ్ల్యూఎ, సిఎంఎ, అబాబ్ ల్యాబ్ సైన్స్ వెబ్ టెక్నాలజీస్ వంటి సాంకేతిక కోర్సులు నేర్చుకుంటే డిగ్రీ పూర్తైన వెంటనే ఉద్యోగం సాధించవచ్చన్నారు. బిటెక్, ఎంబిఎ చదివిన వారు కూడాపై పేర్కొన్న సాంకేతిక పోస్టులు నేర్చుకునే సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతున్నారని ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉద్యోగులను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తమ సంస్థ సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఫైనాన్స్ అండ్ కాస్ట్ అకౌంటింగ్‌లో ప్రాథమిక కోర్సులను ఉచితంగా బోధిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రముఖ సంస్థలైన కార్గిల్ సర్వీసెస్, వాల్ మార్ట్, డిలైట్, టిసిఎస్, ఐబిఎం, అసెంచర్, క్యాప్ జెమిని, బిర్లాసాఫ్ట్, ప్రతినిధులైన ప్రతిమ, శ్రీనివాస్, హరి చందన్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, స్వాతి, వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున, మోహన్ బాబు పాల్గొని విద్యార్థులకు తమ సంస్థలోని ఉద్యోగ అవకాశాలు, వాటిని అందిపుచ్చుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు బాలాంజనేయులు, బోధిషావలి, రాధాకృష్ణ మహేష్, కిరణ్, జ్ఞానశ్రీ, అజిత, అరుణ, షబనం పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇర్ఫాత్

'రౌద్రముఖి' స్ఫూర్తితో మరిన్ని లఘు చిత్రాలు

ప్రజాశక్తి-పీలేరు

'రౌద్రముఖి' లఘుచిత్రం స్ఫూర్తితో ఇక ముందు కూడా మరిన్ని మంచి మంచి లఘుచిత్రాలు నిర్మిస్తామని ఆ చిత్ర నిర్మాత సురేష్, ధర్మకులు సుహేల్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో రెండు రోజుల క్రితం విడుదలైన రౌద్రముఖి లఘు చిత్రం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, దైవభక్తి, గూడెం ప్రజల జీవనశైలి నేపథ్యంలో రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేసిన రౌద్రముఖి లఘు చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని తెలిపారు. ఈ చిత్రం సాధించిన విజయంతో మున్ముందు సమాజానికి ఉపయోగపడే విధంగా, ప్రేక్షకులను అలరించేలా పీలేరు, పరిసర ప్రాంతాల కళాకారులతో లఘుచిత్రాలు నిర్మిస్తామని చెప్పారు. రౌద్రముఖి విజయానికి కృషి చేసిన చిత్ర యూనిట్, నటీనటులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటీనటులు 'ఆల్ ది బెస్ట్' ఖాదర్ బాష, బాబ్జాన్, రాధాకృష్ణ, విజయ్, కృష్ణ, మల్లికార్జున, రాజు, మహేష్, గోపి, మధు. బాలనటి ఆరాధ్య పాల్గొన్నారు.

రౌద్రముఖి విజయోత్సవంలో యూనిట్ సభ్యులు

ఆరోగ్య సంరక్షణ సేవల బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్య సంరక్షణ సేవల్లో బాధ్యతతో పాటు నైపుణ్యం మరింత పెరగాలని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్ఒలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో రమేష్‌రెడ్డి వారికి దిశ నిర్దేశం చేశారు. మహిళా శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసర, తాగునీటి శుభ్రత, వ్యాధుల నిర్ధారణ, నివారణ మొదలగు అంశాలపై నివారణా చర్యలు చేపట్టి, సాధించిన ఫలితాలు రికార్డు, రిపోర్ట్స్, కంప్యూటరీకరించాలని పేర్కొన్నారు. ఆ దిశగా పరిజ్ఞానాన్ని మరింత పెంచుకుని ప్రజలకు మనం అందించే ఆరోగ్య సేవలు, తెలియజేసే ఆరోగ్య సూత్రాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగిన ఫలితంగా తల్లి బిడ్డ మరణాలు పూర్తిగా నియంత్రించి, ఆరోగ్యకర జీవనం దిశగా ప్రోత్సహించాలని సిహెచ్ఒలను కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్ఒలు పాల్గొన్నారు.

శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న పూజారులు

వైభవంగా సీతారాముల కల్యాణం

- ఆకట్టుకొన్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లె లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో, హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా, శ్రీ బద్రాద్రి సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద బహిరంగ వేదికపై, వందల సంఖ్యలోని భక్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణ మధ్య పూజారులు కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం 9 కిలోల లడ్డూ వేలంపాట నిర్వహించారు. 31 వేల రూపాయలకు శశి అనే వ్యక్తి స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం పగలు తిరణాల ఘనంగా జరిగింది. సాయంత్రం ఉట్ల మాను ఉత్సవం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఊట్ల మాను ఎక్కేందుకు యువకులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. విజేతకు రూ.1,116లు నగదు బహుమతిగా అందజేశారు. కల్యాణోత్సవం, పగలు తిరుణాల సందర్భంగా ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు మంగళంపేట బయమ్మ, శంకరయ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేశారు.

ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతంలో 13న జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. రైల్వేకోడూరు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 2,04,466 ఓటర్లు ఉండగా అందులో 1,52,352 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఇవిఎంలలో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమై ఉంది మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లతో ఓటింగ్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నియోజకవర్గంలో ప్రధానంగా వైసిపి అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్ మధ్య తీవ్ర పోటీ నెలకొని ఉంది. ఈ ఎన్నికలలో ఇరు పార్టీలు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు గాను 252 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఓట్ల లెక్కింపులో 14 టేబుళ్ళు ఏర్పాటు చేసి 18 రౌండ్లు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.మంగళవారం మధ్యాహ్నం కి విజయం ఎవరిని వరిస్తుందో తెలిసే అవకాశం ఉంది.

స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

మల్లయ్య కొండపై భక్తుల సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప,మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కురబలకోట మం డలం జడ్‌పిటిసి సభ్యురాలు జ్యోతి, వారి భర్త పైసాని చంద్రశేఖర్ రెడ్డి, దంపతులు మల్లయ్య కొండపై పూజలు నిర్వహించారు. ఎన్నికలలో వైఎస్ఆర్సిపి ఘన విజయం సాధించి మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నట్టు తెలిపారు.

మార్కెట్ యార్డు కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుర్రంకొండ

గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్ పాట్ విధానంతో రైతులు నష్టపోతున్నారని జాక్ పాట్ విధానంతో రైతులను దోపిడీ చేస్తున్న మండీల యజమానులపై చర్యలు తీసుకోని, లైసెన్స్‌లు రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం మార్కెట్ యార్డు కార్యదర్శి కుమార్ రెడ్డి ఎపి రైతు సంఘం, సిపిఐ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వంగిమళ్ళ రంగారెడ్డి, సాంబశివ మాట్లాడుతూ గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో మండీ యజమానులు జాక్‌పాట్ విధానానికి పాల్పడి రైతులను దోచుకోవడం శరా మామూలు అయిపోయిందని అన్నారు. రైతులు జాక్ పాట్ వద్దంటే వ్యాపారులు చాలా తక్కువ ధరకు టమోటాలను కొనుగోలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే మార్కెట్ శాఖ అధికారులు గుర్రం కొండ టమోటా మార్కెట్‌లో పర్యటించి రైతులకు జరుగుతున్న దోపిడీపై విచారించి జాక్ పాట్ విధానానికి పాల్పడుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్‌ఎంపిలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రాథమిక చికిత్స నిర్వాహకులు(ఆర్ఎంపి) వైద్యారోగ్యశాఖ నిబంధనలను పాటించాలని డిప్యూటి డిఎంహెచ్ఒ శిరోమణి పేర్కొన్నారు. సోమవారం సుండుపల్లిలో ఆర్ఎంపి కేంద్రాలను ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ నేపథ్యంలో కొంతమంది ఆర్ఎంపిలు పరారైనట్టు తెలిపారు. మరికొన్ని ఆస్పత్రులపై దాడులు చేశామని చెప్పారు. సరైన ఆధారాలు లేని బాలాజీ, జనని, హరి ప్రథమ చికిత్స కేంద్రాలను గుర్తించామని వీటిని శాశ్వతంగా మూసివేస్తామని చెప్పారు. పట్టణ ప్రాంతంలో ప్రథమ చికిత్స కేంద్రాలు పట్టణ ప్రాంతంలో ఉండకూడదని తెలిపారు.

ఆర్ఎంపి కేంద్రాల వివరాలను తెలుసుకుంటున్న శిరోమణి

సిరులు కురిపిస్తున్న కొత్తిమీర

- రైతు మోములో చిరునవ్వు
- కొత్తిమీర కట్ట ధర రూ.40

ప్రజాశక్తి -రామసముద్రం

హార్టికల్చర్ హబ్‌గా పిలవబడే రామసముద్రం మండలంలో సుగంధ ద్రవ్యాల తయారీ పంటలతో పాటుగా కొత్తిమీర పంటలు పండిస్తున్నారు. భారతీయ వంటకాలలో అంతర్భాగమైన కొత్తిమీర పంటలు మండల వ్యాప్తంగా పండిస్తున్నారు. నిగనిగలాడే మండు వేసవిలో ఉక్కపోత తట్టుకునేలా నేలకు (పంటకు) అవసరమైన నీటిని అందిస్తూ పండించిన కొత్తిమీర పంటలకు అమాంతంగా ధరలు పెరిగాయి. వారం రోజులగా అమాంతం ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రామసముద్రం మండలంలో కొత్తిమీర పంటలకు గిట్టుబాటు ధరలు పెరగడంతో రైతులు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ముఖ్యంగా మండలంలో ఈ సీజన్లో రైతులు కొత్తిమీర పంటలు పండిస్తున్నారు. గతంలో నీరు పుష్కలంగా ఉండటంతో వందల ఎకరాల్లో కొత్తిమీర పంటలు వేసేవారు. ఈ సీజన్‌లో కొత్తిమీర పంటలు పండిస్తున్న రైతులు వందమందిలో పదుల సంఖ్యలో పండిస్తున్నారు. ముఖ్యంగా రామసముద్రం మండలంలోని కురిజల, అనప్పల్లి, కొత్తూరు, పైగడ్డ, ఆర్.నడింపల్లి, కమ్మవారిపల్లి, ఎలకపల్లి, చెంబకూరు, కాప్పల్లి, పెద్దకురప్పల్లి, నారిగానిపల్లి, చోక్కాండ్ల పల్లి, మినికి, కుదురుచీమనపల్లి , మాలేనత్తం, ఉప్పినెళ్లి, మూగయరప్పల్లి, టేకుపల్లి, పూలకుంట్లపల్లి, జక్కులవారిపల్లి, శ్రీరాములపల్లి, గుండెవారిపల్లి, గ్రామాలలో కొత్తిమీర పంటకు అనువైన నేలలు ఉండటంతో కొత్తిమీర పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం కొత్తిమీర కట్ట ధర 40 రూపాయలు పలుకుతున్నదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం మండలంలో దాదాపు 200 ఎకరాలలో మాత్రమే పంట సాగుచేశారు. కొత్తిమీర పంటలు రామసముద్రం మండలం మరియు కర్ణాటక రాష్ట్రంలోని కోలారు, చిక్కబల్లాపురం జిల్లాలో మాత్రమే అధికంగా పండిస్తుంటారు. పంటపై బాగా అనుభవం ఉన్న రైతులు సంవత్సరానికి మూడు పంటలు వేస్తుంటారు. సారవంతమైన నెలల్లో గతంలో నీటిపారుదల తోనే పండించేవారు , ఇప్పుడు మాత్రం డ్రిప్ ఇరిగేషన్ , జిగజాగ్ డ్రిప్ ,స్ప్రింక్లర్ ద్వారా కూడా పండిస్తున్నారు. ధరలు నిలకడగా ఎప్పుడు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రత కంటే అధికం అయినప్పుడు విత్తనాలు మొలకెత్తక నష్టాలు తప్పవని రైతులు చెబుతున్నారు.. వర్షాలు బాగాకురిస్తే కూడా పంటలు దెబ్బతింటుందని అన్నారు. మండల పరిధిలోని రైతులు, అలాగే రాష్ట్ర సరిహద్దు కర్ణాటక రాష్ట్ర ప్రాంతంలోని రైతులు ముఖ్యంగా వేలూరు, తిరుపతి, చెన్నై, బెంగళూర్ , విజయవాడ ప్రాంతాలకు తరలిస్తున్నామని చెప్పారు. కొత్తమీరతో రక్తహీనతను తగ్గిస్తుంది పొగతాగడం, కేమోతెరఫి వల్ల కలిగే నష్టము తగ్గించడానికి పోరాడుతుంది. కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. రక్తనాళాల్లో ఆటంకాలను తొలగిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. నీటిపారుదల పంటలకు, హెక్టారుకు 60 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాషియం మరియు 20 కిలోల సల్ఫర్‌ను ఉపయోగించంచడం ద్వారా పంటను సంరక్షించుకోవచ్చని, మంచి దిగుబడి సాధించుకోవచ్చని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు.

కొత్తిమీర పంట

వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన

తాము గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కలకడ

వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభిస్తున్నదని కలకడ బ్రాంచ్ లైబ్రేరియన్ అమరనాథ తెలిపారు.మండల కేంద్రమైన కలకడలో ఉన్న గ్రంథాలయంలో ఈనెల గత నెల 15 నుంచి గ్రంథాలయం శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని, మండలంలోని విద్యార్థులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు డ్రాయింగ్ వేయడం, క్విజ్ ప్రోగ్రాం, కథలు చెప్పడం, పుస్తకాల చదవడం, క్యారమ్స్, చెస్, వంటి ఆటలాడడం నేర్పుతున్నట్టు తెలిపారు. గ్రంథాలయాలు పుస్తకాల భాండాగారాలు అన్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేసి గ్రంథాలయాలు ఉన్న లాభాలను గురించి వివరించినట్లు తెలిపారు.గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాలు ఈనెల 7వ తేదీకి ముగియ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.**రైల్వేకోడూరు :** రైల్వే కోడూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు లో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం శర్మ విద్యార్థులకు హిందీలో పరీక్ష నిర్వహించారు.25 పదాలకు వాటి అర్థములను ఆ పదాలకు మరల ఆంగ్లంలో అనువాదం అనే విషయంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యా ర్థులకు ప్రతి అంశం నుండి మొదటి బహుమతి, రెండవ బహుమతి, మూడవ బహుమతి జూన్ 7వ తేదీన అందజేయనున్నట్లు లైబ్రేరియన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ వేసవి శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందీ పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు బాలికలు

అండర్-15 జిల్లా జట్టుకు ఎంపికైన అనిల, పూర్విజా

ప్రజాశక్తి-నందలూరు

కడప జిల్లా బాలికల అండర్ -15 క్రికెట్ జట్టుకు నందలూరు సబ్ సెంటర్ నుంచి ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. అనిల, పూర్విజా (మీడియం ఫాస్ట్ బౌలింగ్) కు ఎంపిక అయినట్లు హెడ్ కోచ్ గయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ నెల్లూరు లో జరిగే అండర్-15 మ్యాచ్ కు సెలెక్ట్ అయ్యారని అన్నారు.గతంలో కూడ ఇదే నందలూరు సబ్ సెంటర్ నుంచి అండర్ -15, అండర్19, సీనియర్స్ విభాగాలలో హరి ప్రియ, దివ్యశ్రీ లు కూడా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడాకారులుగా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా నందలూరు సబ్ సెంటర్ నుంచి ఇద్దరు క్రీడాకారులు అండర్-15 జట్టుకు ఎంపిక అయినందున హెడ్ కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్‌లోడి, ట్రైనర్ శివ కోటి, క్యురేటర్ హరికృష్ణ, స్థానిక సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఖాతాదారులు ఎక్కువ...కౌంటర్లు తక్కువ

- నగదు లావాదేవీల కోసం గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి- బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని ఇండియన్ బ్యాంక్‌లో ఖాతాదారులు ఎక్కువగా ఉన్నారు. లావాదేవీలకు కౌంటర్ ఒకటే ఉండడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని బ్యాంకు అధికారులు ప్రత్యక్షంగా చూస్తున్నప్పటికీ కౌంటర్లు పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు సమయం సాయంత్రం నాలుగు గంటలకు వరకు ఉంటుందని, నాలుగు గంటలలోపు బ్యాంకులోకి వెళ్లిన ఖాతాదారులకు సైతం సేవలు అందించకపోవడం శోచనీయమని అన్నారు. బ్యాంకులో ఉన్నవారిని బయటికి పంపించేసి రేపు రండి అని చెప్పడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని పలువురు ప్రజల ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం బ్యాంకు సమయంలో లోపల ఉన్న వారికి సేవలు అందించాల్సి ఉంది,అలా కాకుండా బయటికి పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుండి వేలాది రూపాయలు సర్వీస్ ఛార్జస్ కింద వసూలు చేస్తున్న అధికారులు సేవలందించడం నిర్లక్ష్యం వహించడం సరికాదని అంటున్నారు. సంబంధిత బ్యాంకు మేనేజర్ ఇప్పటికైనా స్పందించి ఖాతాదారుల సమస్యలను గుర్తించి బ్యాంకులో కౌంటర్ల సంఖ్య పెంచాలని ఖాతాదారులు కోరుతున్నారు.

బ్యాంక్‌లో కౌంటర్ వద్ద ఖాతాదారుల రద్దీ

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

రైల్వేకోడూరు: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల తర్వాత జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదని, అలా ఎవరైనా గొడవలకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోక తప్పదని పీలేరు సిఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్‌పి కృష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం సిఐ స్థానిక పోలీసులతో పాటు సిఆర్‌పిఎఫ్ బలగాలతో పీలేరు పట్టణ పరిధిలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి, నిబంధనలను అనుసరించి ఎన్నికల తర్వాత, మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని, పీలేరులో జరగాల్సిన వారపు సంతను కూడా రద్దు చేయడం జరిగిందని అలాగే ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా నివారణా చర్యలో భాగంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, కాబట్టి ప్రజలెవరూ గుంపులుగా చేరడం, ఊరేగింపులు నిర్వహించడం, సంబరాలు చేయడం, టపాకాయలు కాల్చడం, టపాకాయలు విక్రయించడం, మద్యం విక్రయించడం, మద్యం సేవించడం నిషిద్ధమని అన్నారు. కాబట్టి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పోలీసుల హెచ్చరికలను పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సిఐతో పాటు ఎస్ఐ నరసింహుడు సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది పట్టణంలో కవాతు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం వరకు దుకాణాలు మూసివేయాలని దుకాణదారులకు తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఇరు పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు.ఎన్నికల ప్రక్రియ అనంతరం బాణాసంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని ఎస్ఐ డాక్టర్ నాయక్ హెచ్చరించారు. **బి.కొత్తకోట :** మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తు న్నట్లు సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పట్ట ణంలో ఎటువంటి టీ స్టాల్స్, హోటళ్లు, చికెన్ షాపులు, దుకాణాలు నిర్వహించరాదన్నారు. అత్యవసరమైన పాల కేంద్రాలు, మెడికల్ షాపుల నిర్వహణకు మాత్రమే అనుమతులు ఉంటాయన్నారు. మిగతా ఏ ఒక్క వ్యాపారాలకు అనుమతి లేదని సిఐ స్పష్టం చేశారు. నిబంధనలు విరుద్ధంగా వ్యాపారస్తులకు దుకాణా యజమానులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పీలేరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

మద్యం కోసం క్యూలో నిల్చున్న మందుబాబులు

బారులు తీరిన మందుబాబులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు సందర్భంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు మద్యం దుకాణాలు మూసివేయాలని పోలీసులు హెచ్చరించడంతో మందుబాబులు సోమవారం నుంచి మద్యం దుకాణాల వద్ద అధిక సంఖ్యలో బారులు తీరారు. మద్యం దుకాణాలు తెరిచి ఉండడంతో మందు బాబులు దుకాణాల వద్దకు పరుగులు తీశారు.కొంతమంది వారు కోరిన బ్రాండ్లు లభించక నిరాశతో వెనుదిరిగారు.

వైసిపి నాయకుడి మృతికి నివాళి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని రాచపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, వైసిపి నాయకుడు వీరారెడ్డి మృతి వైసిపికి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వీరారెడ్డి మృతి చెందిన సమాచారం ఆ గ్రామ ఎంపిటిసి, వీరారెడ్డి కుమారుడు ద్వారకనాథ్ రెడ్డి నాయకుల ద్వారా తెలుసుకున్న మోహన్‌రెడ్డి వీరారెడ్డి మృతదేహాని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరారెడ్డి సుదీర్ఘకాలంగా గ్రామానికి ఎన్నో విధాలుగా సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, పెద్దిరెడ్డి, మాజీ ఎంపిపి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో బస్సు పాసుల పంపిణీ రద్దు

ప్రజాశక్తి-పీలేరు

జూన్ 6, 7 తేదీల్లో బస్సు పాసుల పంపిణీ రద్దు చేయడం జరిగిందని పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బస్సు పాసుల మాడ్యూల్ సర్వర్ అప్ గ్రేడ్ చేస్తున్న కారణంగా పై తెలిపిన రెండు రోజులూ ఎలాంటి బస్సు పాసులు పంపిణీ చేయడం జరగదని తెలియజేశారు. ప్రత్యేక ప్రతిభావంతుల బస్సు పాసులు, నెలవారీ రాయితీ పాసులు ఇవ్వబడవన్నారు. తిరిగి 8 నుండి యధావిధిగా అన్ని రకాల బస్సు పాసులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. కావున, విద్యార్థులు, ప్రత్యేక ప్రతిభావంతులు, ఇతరులు ఈ అసౌకర్యాన్ని గుర్తించుకుని తమకు సహకరించాలని కోరారు.

మహిళాభివృద్ధితోనే సమసమాజం సాధ్యం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు : మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమసమాజం సాధ్యమని జనవిజ్ఞానవేదిక (జెవివి) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక జెవివి కార్యాలయంలో సోమవారం వేసవి శిబిరాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పనుల్లో ఆడ,మగ అనే తేడా లేకుండా అన్ని రకాల పనులను అందరూ చేసే సంస్కృతి సమాజంలో రావాలన్నారు. పిల్లలు ఇష్టంగా చదివితేనే విజ్ఞానం అందుతుందన్నారు. ఆటలు చదువులో భాగంగా ఉండాలన్నారు. సాంకేతికతను అభివృద్ధి కోసమే వినియోగించుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రామాపురం

పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యతలని ఎపి పొల్యూషన్ సెంట్రల్ బోర్డ్ వారి ఆదేశాల మేరకు మండలంలోని నల్లగుట్టపల్లె సచివాలయం వద్ద సోమవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలకు 'మనభూమి -మన జీవితం' అనే కార్యక్రమం పై ప్రజలకు వివరించారు. ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని, ధ్వని కాలుష్యం, జల కాలుష్యాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటడంతోపాటు అడవుల పరి రక్షణ లో అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మునెమ్మ, కళాజాత బృందం సభ్యులు రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న కళాశాత బృందం సభ్యులు

క్రైం కార్నర్

గోడకూలి మహిళ మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

గోడకూలి మహిళ మృతి చెందిన ఘటన సోమవారం రాయచోటి పట్టణంలో చోటు చేసు కుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు..పట్టణంలోని మాసా పేటలో నివాసమున్న మార్జల లక్ష్మి ప్రసన్న(40) తాము నివాస మున్న ఇంటి పక్క ఇంటికి మరమ్మతులు చేస్తున్నారని తెలి పారు.పని కోసం ఇంటిలో నుంచి బయటకు వచ్చిన ఆమెపై పక్క ఇల్లు మరమ్మతు చేస్తున్న క్రమంలో అక స్మాత్తుగా గోడకూలి లక్ష్మిప్రసన్న పై పడిందన్నారు. ఊపి రాడక కొట్టుమిట్టాడుతున్న క్రమంలో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలి స్తుండగానే మార్గమధ్యలో మృతి చెందిందని తెలిపారు. మృతురాలికి కొడుకు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మి ప్రసన్న మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మృతి చెందిన రవివర్మ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కడప-చెన్నై హైవే రోడ్డులో బైక్ అదుపుతప్పి యువకుడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి లోని అనంతరాజుపేట గ్రామానికి చెందిన రవివర్మ, పరశురాం అనే ఇద్దరు యువకులు బైక్‌పై వస్తుండగా పుత్తనవారిపల్లి మలుపు వద్ద మోరి ఢీకొట్టారని అన్నారు. ఈ ప్రమాదంలో అనంతరాజుపేట గ్రామానికి చెందిన రవివర్మ (32) అక్కడికక్కడే మృతి చెందగా, పరశురాం స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పిం చుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి తరలిం చినట్లు తెలిపారు. మృతి వ్యక్తి హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడేవాడని పేర్కొన్నారు. పోలీసులు పదేపదే చెబుతున్న ద్విచక్ర వాహనాలు ఇప్పటికీ హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. పోలీసులు చెప్పేది వాహనదారుల శ్రేయస్కర కోసమేనని పేర్కొన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రఘురాం తెలియజేశారు.